సాక్షి యాదాద్రి భువనగిరి

7

మహిళా దినోత్సవం

శనివారం । 8 । మార్చి । 2025






సమాజంలో సగభాగమైన మహిళలు ఇంటా బయట ఇంకా వివక్షను ఎదుర్కొంటున్నారు. ఆధునిక సమాజంలోనూ పురాతన పోకడలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'సాక్షి' ఉమ్మడి జిల్లాలోని ఏడు ముఖ్య పట్టణాల్లో మహిళల ఇబ్బందులపై నిర్వహించిన సర్వేలో పలు విషయాలు వెలుగుచూశాయి. 18 నుంచి 50 సంవత్సరాల వయస్సున్న 200 మంది మహిళలను సర్వే చేయగా.. ఇప్పటికీ ఇంట్లో ఆడ, మగ వివక్షను ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-సాక్షి నెట్‌వర్క్


అక్కడ.. ఇక్కడ కాదు.. ఎక్కడైనా వివక్షే!

- ఆడ మగ వివక్ష ఇంట్లో కూడా ఉంది
- బయట ప్రదేశాలకన్నా ఆఫీస్, కళాశాలల్లోనే ఎక్కువ ఇబ్బంది


ప్రశ్న: మీ ఇంట్లో ఆడ-మగ వివక్ష ఏమైనా ఉందా?




ప్రశ్న: మీ కాలేజీ, పని ప్రదేశంలో మహిళగా ఏమైనా వివక్షను ఎదుర్కొంటున్నారా?



ప్రశ్న: మీరు ఎక్కువ ఇబ్బంది పడుతున్న ప్రదేశం?



ప్రశ్న: మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్న వారిలో అత్యధికులు ఎవరు?



మహిళలు, విద్యార్థినుల భద్రతకు షీటీంలు

మహిళా పోలీస్ స్టేషన్ సీఐ అర్జునయ్య



సాక్షి యాదాద్రి : మహిళలు, విద్యార్థినుల భద్రతకు పోలీసు శాఖ అధిక ప్రాధాన్యమిస్తోంది. ఇందుకోసం జిల్లాలో మూడు షీటీంలు ఏర్పాటు చేశాం. సమస్యలు ఎదురైతే ఫిర్యాదు చేయడానికి టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేశాం.. అని భువనగిరి మహిళా పోలీసు స్టేషన్ సీఐ అర్జునయ్య తెలిపారు. శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.

తాగుడుకు బానిసలై..

భర్తలు మద్యానికి, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసలై భార్యలను వేధింపులకు గురిచేస్తున్న సంఘటనలు పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. అదనపు కట్నం కావాలని కొందరు, బెట్టింగ్‌లో నష్టపోయి మరికొందరు.. పుట్టింటి నుంచి డబ్బు తీసుకురావాలని ఒత్తిడి చేస్తున్నారు. మాటవినకపోతే వేధింపులకు పాల్పడుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో మహిళలు న్యాయంకోసం పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు.

అధికంగా గృహహింస కేసులే..

మహిళలు, విద్యార్థినులకు సంబంధించి 2023లో 1,118 ఫిర్యాదులు రాగా 128 కేసులు, 2024లో 999 ఫిర్యాదులు రాగా 111 కేసులు నమోదయ్యాయి. 2025 మార్చి 5వ తేదీ నాటికి 150 ఫిర్యాదులు రాగా 23 కేసులు నమోదు చేశాం. ఇందులో గృహహింసకు సంబంధించినవే అధికంగా ఉన్నాయి. దంపతులకు కౌన్సిలింగ్ ఇచ్చి వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నాం.

షీటీంలతో నిరంతర నిఘా

మహిళలు, విద్యార్థునులకు షీటీంలు అండగా ఉంటున్నాయి. బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు తదితర ప్రాంతాల్లో మఫ్టీలో ఉంటూ నిఘా ఉంచుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా మూడు షీటీంలు పనిచేస్తున్నాయి.

100కు డయల్ చేయండి

87126 62762 షీటీం నంబర్

నూతన డీసీపీగా అక్షాంశ్ యాదవ్



సాక్షి, యాదాద్రి : భువనగిరి జోన్ డీసీపీ రాజేశ్ చంద్ర బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హైదరాబాద్ సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాంశ్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అక్షాంశ్‌యాదవ్ 2019 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ఇక్కడ పనిచేస్తున్న డీసీపీ రాజేశ్‌చంద్ర కామారెడ్డి జిల్లా ఎస్పీగా బదిలీ అయ్యారు. రాజేశ్‌చంద్ర 2023 జనవరి 25న జిల్లాకు వచ్చారు.

అసమానతలు అంతరించాలి

మహిళా చైతన్యంలో పత్రికల పాత్ర కీలకం

వివక్షను రూపుమాపితేనే అద్భుత సమాజం | బాధిత మహిళలకు అండగా ఉండాలి | నల్లగొండ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి బి.దీప్తి

మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' గెస్ట్ ఎడిటర్‌గా విధులు



సాక్షి ఎడిటోరియల్ విభాగంలో గెస్ట్ ఎడిటర్ విధుల్లో నల్లగొండ జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి దీప్తి

రామగిరి(నల్లగొండ) : సమాజంలో కొన్నిచోట్ల ఇంకా లింగ వివక్ష కనిపిస్తోందని అది రూపుమాపితేనే అద్భుత సమాజం ఆవిష్కృతమవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి.దీప్తి పేర్కొన్నారు. పత్రికలు మహిళలను చైతన్య పరిచేలా కథనాలను ప్రచురించాలని సూచించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం 'సాక్షి' యూని ట్ కార్యాలయంలో ఆమె గెస్ట్ ఎడిటర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవ ప్రత్యేక కథనాలపై చర్చించి పలు సూచనలు చేశారు.

ధైర్యంగా నిలబడాలి

మహిళలు సమస్యలకు కుంగిపోకుండా ధైర్యంగా నిలబడాలని జడ్జి దీప్తి సూచించారు. మహిళా సాధికారత జరిగినప్పుడే సమాజంలోని అసమానతలు తొలగిపోతాయన్నారు. మహిళలను తక్కువ చేసి చూడకుండా సమాన అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో భాగస్వామ్యం కల్పిస్తే వారి సమస్యలను వారే పరిష్కరించుకోగలగుతారని పేర్కొన్నారు. బాధ్యతల విషయంలో మహిళలను వేరు చేసి చూడొద్దన్నారు. ఉద్యోగం చేసే మహిళలను కొందరు కుటుంబాన్ని, ఉద్యోగాన్ని ఎలా బ్యాలెన్స్ చేస్తున్నావని అడుగుతారని.. అదే ప్రశ్న మగవారిని మాత్రం అడగరని ఇది సరి కాదన్నారు. సమాజంలో మహిళలపై వివక్షను రూపుమాపితేనే మహిళలు స్వేచ్ఛాయుత ప్రయాణానికి అడుగులు పడతాయన్నారు.



కథనాలు పరిశీలిస్తూ.. సూచనలు చేస్తూ

మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక పేజీలు, కథనాలను జడ్జి బి.దీప్తి పరిశీలించారు. మహిళలపై ప్రత్యేకంగా రూపొందించిన కథనాలను చూసి ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. మద్యపాన నిషేధం కోసం మహిళలు పోరాడిన కథనాలను ప్రశంసించారు. పత్రికలు మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించేలా.. చైతన్యం కలిగించే కథనాలు అందించాలన్నారు. బాధిత మహిళలకు అండగా ఉండాలని సూచించారు.

న్యాయ సహాయం అందిస్తాం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా బాధితులకు న్యాయ సహాయం అందిస్తున్నామని జడ్జి దీప్తి తెలిపారు. అందరికీ సమాన న్యాయం దక్కాలనేది తమ సంస్థ లక్ష్యమన్నారు. న్యాయపరంగా వెనుకబడిన వారికి అండగా న్యాయ సేవాధికార సంస్థ చేయూతనిస్తోందని.. ఇప్పటికే అనేక న్యాయ చైతన్య సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యపర్చామన్నారు. ఇరువర్గాల మధ్య సమన్వయకర్తగా వ్యవహరించి సత్వర న్యాయం అందేలా సహకరిస్తామన్నారు. న్యాయ సహాయం పొందాలనుకునే వారు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాలని సూచించారు.

జగన్మోహినిగా వెలిగి.. ఎదుర్కోలుకు కదిలి



శ్రీస్వామి, అమ్మవారిని ఊరేగింపుగా ఎదుర్కోలు మండపానికి తోడ్కొని వెళ్తున్న అర్చకులు, ఆలయ అధికారులు.. చిత్రంలో పట్టువస్త్రాలతో కలెక్టర్ దంపతులు, ఈఓ

యాదగిరిగుట్ట: యాదగిరీశుడి బ్రహ్మోత్సవాల్లో ఎదుర్కోలు మహోత్సవం శుక్రవారం రాత్రి వేద పండితుల మంత్రోచ్చరణలతో వీనులవిందుగా సాగింది. పట్టువస్త్రాలు, బంగారు ఆభరణలతో అలంకరించిన శ్రీస్వామివారిని అశ్వవాహనంపై, అమ్మవారిని ముత్యాల పల్లకిపై అధిష్టింపజేసి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం తూర్పురాజగోపురం ఎదుట మాడ వీధిలో స్వామి వారిని పశ్చిమ ముఖంగా, అమ్మవారిని తూర్పు ముఖంగా అధిష్టింపజేశారు. ఆలయ ఈఓ భాస్కర్ రావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటచార్యులు, అర్చకులు, ఇతర అధికారులు శ్రీస్వామి, అమ్మవారి తరఫున విడిపోయి పెద్దలుగా వ్యవహరించారు. ఇరువురి గుణగణాలు, ఆదాయం, వ్యయం, కట్నకానుల కపై వివరించారు. అనంతరం తిరుకల్యాణ మహోత్సవానికి ముహూర్తం నిర్ణయించారు. అంతకు ముందు ఉదయం శ్రీలక్ష్మీనరసింహుడు జగన్మోహిని అలంకారంలో ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.



జగన్మోహిని అలంకారంలో నృసింహుడు

నేడు తిరుకల్యాణోత్సవం

లక్ష్మీసమేత నారసింహుడు శనివారం ఉదయం రామాలంకారంలో హనుమంత సేవపై దర్శనమిస్తారు. రాత్రి 8.30 గంటలకు గజవాహన సేవపై కల్యాణమండపానికి బయలుదేరుతారు. 10 గంటలకు తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళా పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం చేస్తున్న కలెక్టర్, చిత్రంలో అదనపు కలెక్టర్, అధికారులు

- కలెక్టర్ హనుమంతరావు

సాక్షి,యాదాద్రి : మహిళలు అన్ని రంగాల్లో రాణించి సాధికారత సాధించాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. చదువుతో పాటు ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక స్వావలంబన తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. ఒక మహిళ ఉన్నతస్థాయిలో ఉంటే కుటుంబానికి, సమాజానికి ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ మహిళలు సాధికారత సాధించడం వల్ల సమాజం, కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ మాట్లాడుతూ నేటి సమాజాంలో మహిళలు విద్య, విజ్ఞానంతో ముందుకెళ్తుండడం అభినందనీయమన్నారు. జేఏసీ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో తమ సహాయ సహకారం ఉంటుందన్నారు. అనంతరం ఆటలపోటీల్లో గెలుపొందిన మహిళా ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే కలెక్టరేట్‌లో పని చేస్తున్న మహిళా పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో కలక్టరేట్ ఏఓ జగన్మోహన్‌ప్రసాద్, జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఈఓ సత్యనారాయణ, టీజీఓ జనరల్ సెక్రటరీ కవిత, సెక్రటరీ ఖదీర్, నాన్ గెజిటెడ్ ట్రెజరర్ శ్రీకాంత్, శ్రీనివాస్, చైతన్య, జిల్లా కోశాధికారి సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

వేసవి సన్నద్ధతపై నేడు సమీక్ష

సాక్షి,యాదాద్రి : వేసవిలో మంచినీటి ఎద్దడి, విద్యుత్ సమస్య పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్, అదనపు కలెక్టర్లు, విద్యుత్, మిషన్ భగీరథ, ఇరిగేషన్ అధికారులు హాజరుకానున్నారు. పూర్తి సమాచారంతో నివేదికలు సిద్ధం చేసుకుని రావాలని ఆయా శాఖల అధికారులకు ఉన్నతస్థాయి ఆదేశాలు అందాయి.

ఇంగ్లిష్ పేపర్-1కు 6,104 మంది హాజరు

భువనగిరి : ఇంటర్మీడియట్ పరీక్షలు మూడో రోజు ప్రశాంతంగా కొనసాగాయి. శుక్రవారం జరిగిన ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 6,411 మంది విద్యార్థులకు 6,104 మంది హాజరయ్యారు. 307 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ విభాగంలో 4,757 మందికి ,4628 మంది హాజరు కాగా.. 129 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,654 మందికి గాను 1,476 మంది పరీక్ష రాశారు. 178 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ రమణి తెలిపారు. పరీక్ష కేంద్రాలను డీఐఈఓతో పాటు పలువురు అధికారులు తనిఖీ చేశారు.

సైబర్ నేరాల కట్టడికి ప్రత్యేక వ్యూహం

- రాచకొండ సీపీ సుధీర్‌బాబు
- అడ్డగూడూరు పోలీస్ స్టేషన్ తనిఖీ

అడ్డగూడూరు : శాంతిభద్రల పరిరక్షణతో పాటు సైబర్‌నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక వ్యూహం రూపొందిస్తున్నట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. శుక్రవారం అడ్డగూడూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన డీసీపీ రాజేశ్‌చంద్రతో కలిసి తనిఖీ చేశారు. నూతన భవనం కోసం ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విజిబుల్ పోలీసింగ్, సైకిల్ పెట్రోలింగ్ ద్వారా ప్రజలకు మరింత చేరువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. సైబర్‌నేరాలు, రోడ్డు సేఫ్టీ, మహిళల భద్రత వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్టేషన్‌లో రికార్డులు, కేసుల దర్యాప్తు, పురోగతి, సీసీటీవీల నిర్వహణపై సమీక్షించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించారు. రూ.1.52 కోట్ల వ్యయంతోప్రత్యేక వసతులతో కూడిన అత్యాధునిక పోలీస్ స్టేషన్ నిర్మిస్తామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాజేశ్‌చంద్ర, ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, రామన్న పేట సీఐ వెంకటేశ్వర్లు, అడ్డగూడూరు, మోత్కూర్,ఆత్మకూరు ఎస్ఐలు నాగరాజు, నాగరాజు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు, చిత్రంలో డీసీపీ రాజేశ్‌చంద్ర

నేడు జాతీయ లోక్ అదాలత్

భువనగిరి టౌన్ : జిల్లాలోని అన్ని కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరస్పర అంగీకారంతో సుమారు నాలుగు వేల కేసులు రాజీపడదగినవి ఉన్నాయన్నారు. ఉదయం 10 గంటలకు లోక్ అదాలత్ ప్రారంభం కానుందని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని న్యాయ, పోలీస్, ఎక్సైజ్ తదితర శాఖల అధికారులు కోరారు. రాజీమార్గమే రాజమార్గమని వారు పేర్కొన్నారు.

మద్యంపై.. మహిళల సమరం

బెల్టు షాపులు బంద్ చేయించిన అతివలు

- మద్యం అమ్మకాలు జరిపితే జరిమానా విధించాలని నిర్ణయం
- ఆదర్శంగా నిలుస్తున్న చిట్యాల మండలం ఏపూరు, రాజాపేట మండలం పాముకుంట

ఎక్కడమ్మా నువ్వు లేనిది.. ఏమిటీ నువ్వు చెయ్యలేనిది. మహిళలు ఏకమైతే సాధించలేనిది ఏమీ లేదు. గ్రామాల్లో మద్యం మహమ్మారికి యువత బానిస కావడం, కొన్ని కుటుంబాలు చిన్నాభిన్నం కావడంతో ఆ ఊళ్లలో మహిళలు కొంగు నడుముకు చుట్టారు. మద్యం మహమ్మారిని పారదోలాలని నిర్ణయించుకున్నారు. గ్రామంలో నిర్వహించే బెల్ట్ దుకాణాలపై సమరం సాగించారు. మద్యం అమ్మకాలను అడ్డుకుని ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచారు చిట్యాల మండలం ఏపూరు, రాజాపేట మండలం పాముకుంట మహిళలు.

- చిట్యాల, రాజాపేట

చిట్యాల మండలం ఏపూరు గ్రామం జాతీయ రహదారికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామంలో 1950 మందికిపైగా జనాభా ఉంది. ఈ గ్రామానికి చెందిన పురుషులు ఎక్కువగా డ్రైవర్లుగా, కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. ఆ గ్రామంలో పదిహేనుకుపైగా బెల్టుషాపులు ఉన్నాయి. వీటిలో అన్ని రకాల బ్రాండ్‌లకు చెందిన మద్యం లభిస్తుంది. దీంతో ఆ గ్రామంలోని యువకులతో పాటు చుట్టుపక్కల పరిశ్రమల్లో పనిచేసే వందలాది మంది కార్మికులు సైతం ఇక్కడ విచ్చలవిడిగా మద్యం సేవిస్తుంటారు. ఆ గ్రామానికి చెందిన పలువురు మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకున్నారు. మరికొందరు చేసిన పనిచేసిన డబ్బులను మద్యానికి ఖర్చు చేస్తూ కుటుంబాలను పట్టించుకోవటం లేదు. దీంతో ఆ గ్రామ మహిళలంతా ఏకమై మద్యం మహమ్మారిని పారదోలాలని నడుం బిగించారు.



చిట్యాల మండలం ఏపూరులో పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశమైన మహిళలు (ఫైల్)

మద్యంపై యుద్ధం మొదలైంది ఇలా..

ఏపూరు గ్రామానికి చెందిన ఓ యువకుడు (20) ఫిబ్రవరి 12న రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆ యువకుడి మృతికి మద్యం మహమ్మారే కారణమని భావించారు. ఆ యువకుడు మృతి చెందిన రోజే గ్రామంలో మద్యపానం నిషేధానికి నడుం బిగించారు. ఆ గ్రామంలోని మహిళ సంఘం అధ్యక్షురాలు వలిగొండ సునీత, ప్రధానకార్యదర్శి బొంగు శ్రీలత, వీబీకే బండ అనురాధ ఆధ్వర్యంలో మహిళలంతా ఏకమై బెల్ట్ దుకాణాలను మూసివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ వద్ద సమావేశమై నిరసన తెలిపారు. గ్రామంలో బెల్ట్ దుకాణాల వద్దకు వెళ్లి మద్యం అమ్మొదని హెచ్చరించారు. గ్రామంలో బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే రూ.లక్ష, మద్యం తాగిన వారికి రూ.20 వేలు జరిమానా.. మద్యం అమ్మినవారి సమాచారం అందిస్తే రూ.10 వేల ప్రోత్సాహకం అందజేస్తామని తీర్మాణించారు. ఆ రోజు నుంచి గ్రామంలో మద్యం అమ్మకాలు నిలిచిపోయాయి.

నెలరోజులుగా మద్యం అమ్మడం లేదు



మా గ్రామంలో పదిహేనుకు పైగా బెల్ట్ దుకాణాల్లో మద్యం అమ్మేవారు. గ్రామంలోని యువతతో పాటు పెద్దవారు సైతం మద్యానికి బానిసై ఆర్థికంగా.. ఆరోగ్య పరంగా నష్టపోతున్నారు. ఇటీవల మద్యం మత్తులో ఓ యువకుడు మృతిచెందాడు. వెంటనే గ్రామంలో బెల్ట్ దుకాణాలను అరికట్టాలని మహిళలమంతా కలిసి ర్యాలీ నిర్వహించాం. మద్యం అమ్మితే జరిమానా విధించాలని తీర్మాణించాం. నెల రోజులుగా గ్రామంలోని బెల్ట్ దుకాణాలను తొలగించారు. మద్యం అమ్మకాలు నిలిచిపోయాయి.

- బొంగు శ్రీలత, మహిళా సంఘం ప్రధానకార్యదర్శి, ఏపూరు

వేలంపాటను అడ్డుకొని..

రాజాపేట : యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని పాముకుంట గ్రామంలో మూకుమ్మడిగా మద్యపాన నిషేధం పాటిస్తున్నారు. గ్రామంలో కొన్ని సంవత్సరాలుగా బెల్టుషాపులు నడుస్తుండటంతో వృద్ధులు, యువకులు, పేదలు మద్యానికి బానిసై.. సంపాదించిందల్లా మద్యానికి ఖర్చు చేస్తు నారు. అంతే కాకుండా గ్రామంలో బెల్టుషాపుల నిర్వాహణ కోసం ఇటీవల వేలం పాట నిర్వహించారు. దీంతో గ్రామంలోని కొంతమంది మహిళలు గ్రామస్తులతో కలిసి గ్రామంలో ఎలాంటి బెల్టు షాపులు నిర్వహించొద్దని, మద్యం విక్రయించొద్దని మూకుమ్మడి నిర్ణయం తీసుకుని అమలు చేస్తున్నారు.

అప్పట్లో సారాపై పోరాటం

పాముకుంట గ్రామంలో 2010–11 సమయంలో సారా ఏరులైపారేది. కూలినాలి చేసి వచ్చిన డబ్బంతా తాగుడుకే పోయేది. ఆ సమయంలో కుటుంబ పెద్దలను కోల్పోయి చాలా కుటుంబాలు వీధిన పడ్డాయి. దీంతో గ్రామానికి చెందిన మహిళలు ఏకమై సారా విక్రయ కేంద్రాలపై దాడిచేసి సామగ్రిని గ్రామం నడిబొడ్డున దహనం చేశారు. నాతర్వాత ప్రభుత్వం సారా విక్రయాన్ని నియంత్రించడంతో ఏడాదిపాటు గ్రామంలో సారా, మద్యం విక్రయాలు జరగలేదు.



మద్యం విక్రయించవద్దని రాజాపేట మండలంలోని పాముకుంట ఎస్సీ కాలనీలో ప్రచారం చేస్తున్న మహిళలు

మహిళలంతా ఏకమయ్యాం



గ్రామంలో విచ్చలవిడిగా బెల్టుషాపులు ఉండడంతో పేదలు మద్యానికి బానిసవుతున్నారు. రోజంతా కూలికి వెళ్లి సంపాదించింతా తాగుడుకే తగలేస్తున్నారు. కుటుంబాలను పట్టించుకోకపోవడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు. నాభర్త మద్యం సేవించి పక్షవాతంతో మంచానికే పరిమితం అయ్యాడు. దీంతో గ్రామంలో మద్యం విక్రహించకుండా మహిళలంతా ఏకమయ్యాం.

- వట్టిపల్లి లక్ష్మీనర్సమ్మ, పాముకుంట

చేనేతలో 'ఆమె' ఘనత

- సిల్క్ ఇండస్ట్రీ యూనిట్ స్థాపించి 50 మందికి ఉపాధి కల్పిస్తున్న పోచంపల్లి వాసి ఎన్నం మాధవి



భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లికి చెందిన చేనేత కళాకారిణి ఎన్నం మాధవి చేనేత రంగంలో అనేక ప్రయోగాలు చేస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోంది. ఇంటర్ వరకు చదువుకున్న ఆమె తన భర్త ఎన్నం శివకుమార్ సహకారంతో కొర(లైట్ గోధుమరంగు), లైట్ పింక్, టర్కిష్ బ్లూ, గ్రే, లైట్ బ్రౌన్ రంగులతో మర్తాస్ ఫుల్ డిజైన్‌తో కూడిన వస్త్రాన్ని ఆవిష్కరించింది. దీంతో గతేడాది జాతీయ చేనేత దినోత్సవం రోజున రాష్ట్ర ప్రభుత్వం ఆమెను ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీ అవార్డుతో సత్కరించింది. ఇటీవల ఢిల్లీలో రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా నిర్వహించిన పరేడ్‌లో ఆమె తెలంగాణ నుంచి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. గత నెల ఢిల్లీలోని సూరజ్‌కుండ్ మేళాలో ఆమె పాల్గొని పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల ఎగ్జిబిషన్, అదేవిధంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరుగుతున్న అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో పాల్గొని చేనేత ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసింది. పోచంపల్లి పట్టణ కేంద్రంలో శ్రీరంజన్ సిల్క్ ఇండస్ట్రీ యూనిట్‌ను స్థాపించి సిల్క్ దారం నుంచి వస్త్రం తయారీ వరకు అన్నీ ఒకే దగ్గర తయారు చేయిస్తోంది. ఈ పరిశ్రమ ద్వారా 50 మందికి ఉపాధి కల్పిస్తోంది. అంతేకాక శ్రీరంజ్ వీవ్స్ పేరిట షాపు నిర్వహిస్తూ చేనేత వస్త్రాలను మార్కెటింగ్ కూడా చేస్తోంది. 2023 డిసెంబర్ 20న పోచంపల్లికి వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శ్రీరంజన్ సిల్క్ యూనిట్‌ను సందర్శించారు. అక్కడ తయారైన చేనేత వస్త్రాలను చూసి మాధవిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాధవిని ప్రత్యేకంగా అభినందించారు.



ఢిల్లీలో చేనేత ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన మాధవి (ఫైల్) (ఇన్‌సెట్‌లో) తాను తయారుచేసిన చీరను చూపుతున్న మాధవి

పర్యావరణ హితం.. రమణి అభిమతం

- బయోడీగ్రేడబుల్ బ్యాగులు తయారు చేస్తున్న మహిళా పారిశ్రామికవేత్త
- గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమతో పలువురికి ఉపాధి



తన పరిశ్రమలో తయారవుతున్న బయోడీగ్రేడబుల్ కవర్లను పరిశీలిస్తున్న రమణి



చౌటుప్పల్ రూరల్: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా భూమిలో త్వరగా కలిసిపోయే బ్యాగులు తయారు చేయాలనే సంకల్పం ఆమెను పారిశ్రామికవేత్తను చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా సంతమంగులూరు మండలం మామిళ్లపల్లికి చెందిన శ్రీరామనేని రమణి ఎమ్మెస్సీ వరకు చదివింది. రమణి భర్త డాక్టర్ ప్రసాద్ సౌదీ అరేబియాలోని రియాద్‌లో ప్రభుత్వ వైద్యుడిగా విధులు నిర్వహించడంతో ఆమె కూడా 13 ఏళ్ల పాటు అక్కడే ఉండి భారత్‌కు తిరిగివచ్చారు. ఇక్కడకు వచ్చిన తర్వాత రమణి భర్తకు కిడ్నీ మార్పిడి చేయాల్సి వచ్చింది. దీంతో ఆమె తన కిడ్నీ దానం చేసింది. ఆ సమయంలో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా బయోడీగ్రేడబుల్ సంచులు తయారు చేయాలనే ఆలోచన రావడంతో ఆమె డీఆర్‌డీఓ శాస్త్రవేత్తల్ని కలిసింది. డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు సూచించిన పరిజ్ఞానంతో బయోడీగ్రేడబుల్ సంచులు తయారు చేయడం ప్రారంభించారు. రెండేళ్ల పాటు కుటీర పరిశ్రమగా నిర్వహించిన తర్వాత యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌లో రమణి ఇండస్ట్రీస్ పేరుతో బయోకంపోస్టికా పరిశ్రమను స్థాపించారు. గతేడాది నవంబర్ నుంచి ఇక్కడ నుంచి బయోడీగ్రేడబుల్ సంచులు, గిఫ్ట్ బ్యాగుల తయారీని ప్రారంభించారు. క్యారీ బ్యాగులు, ఎన్వలప్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ షీట్లు, మల్చింగ్ కవర్లు ఈ పరిశ్రమలో తయారు చేస్తున్నారు. వాటిని సౌదీ అరేబియాకు ఎగుమతి చేస్తున్నారు. ఈ పరిశ్రమలో రెండు షిఫ్టుల వారీగా 35మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

జాతీయ స్థాయిలో ఊరి పేరు నిలబెట్టింది

- పోతిరెడ్డిపల్లి రూపురేఖలు మార్చిన మాజీ మహిళా సర్పంచ్



గనగాని మాధవి

ఆత్మకూరు(ఎం): ఉన్నత చదువులు చదివిన ఆ మహిళ మారుమూల గ్రామానికి సర్పంచ్‌గా ఎన్నికై ఆ గ్రామ పేరును దేశస్థాయిలో నిలబెట్టింది. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి 2018 నుంచి 2024 ఫిబ్రవరి వరకు గనగాని మాధవి సర్పంచ్‌గా కొనసాగారు. డిగ్రీ, డీఎడ్ పూర్తిచేసిన మాధవి ఉన్నత చదువులు చదివే అవకాశం ఉన్నప్పటికీ సర్పంచ్‌గా అవకాశం రావడంతో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. ఇంటింటికి చెత్త సేకరణతో పాటు గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రతి వీధిలో మొక్కలు నాటే కార్యక్రమం, నిరుపేదలకు ఆర్థికసాయం అందజేయడం వంటి పనులు చేపట్టింది. గనగాని మాధవి చేసిన కృషి ఫలించి 2021లో రాష్ట్ర ప్రభుత్వం పోతిరెడ్డిపల్లిని ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక చేసింది. అప్పట్లో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్ చేతుల మీదుగా మాధవి అవార్డు అందుకున్నారు. అంతేకాకుండా రాష్ట్ర స్థాయిలో సావిత్రిబాయి పూలే అవార్డును సైతం 2022లో ఆమె అందుకున్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా పోతిరెడ్డిపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దడంతో గనగాని మాధవి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఎంపికైన ఉత్తమ సర్పంచ్‌లతో కలిసి హర్యానా, ఢిల్లీ ప్రాంతాల్లో పర్యటించారు. గ్రామాభివృద్ధిలో తన భర్త, గ్రామస్తుల సహకారం మరువలేనిదని పేర్కొన్నారు.



2021లో అప్పటి యాదాద్రి జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్ చేతుల మీదుగా ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు అందుకుంటున్న మాధవి

డ్రమ్ సీడర్ విధానంతో అధిక దిగుబడులు

భువనగిరి: రైతులు వ్యవసాయంలో నూతన పద్ధతులను అనుసరిస్తూ డ్రమ్ సీడర్ విధానంలో వరి సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక భువనగిరి కేంద్రం శాస్త్రవేత్తలు అనిల్‌కుమార్, రాజు, మధుశేఖర్ అన్నారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులకు, రైతులకు శుక్రవారం భువనగిరి మండలంలోని కూనూరు గ్రామంలో డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి విత్తనాలు విత్తే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ఎప్పటికప్పుడు నూతన వ్యవసాయ పద్ధతుల గురించి తెలుసుకుని పంటల సాగులో అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

రుణాల మంజూరు సులభతరం చేయాలి

- టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి



వ్యాపారవేత్తలకు రుణాల చెక్కులను అందజేస్తున్న నిర్మలాజగ్గారెడ్డి

చౌటుప్పల్ రూరల్: వ్యాపారవేత్తలకు బ్యాంకర్లు మంజూరు చేసే రుణాలను సులభతరం చేయాలని రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థ(టీజీఐఐసీ) చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి సూచించారు. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పరిధిలోని గ్రీన్‌ఇండస్ట్రియల్ పార్క్‌లో యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో మెగా ఔట్‌రీచ్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యువ పారిశ్రామిక వేత్తలతో పాటు మహిళ పారిశ్రామికవేత్తలకు పెద్దపీట వేస్తుందని అన్నారు. ఈ తరుణంలో బ్యాంకులు లోన్ ఇవ్వడానికి అనేక కొర్రీలు విధించడం వల్ల రుణాలు పొందలేకపోతున్నారని చెప్పారు. రాష్ట్రం ఆర్థికంగా బలపడాలంటే వ్యవసాయం తరువాత పారిశ్రామిక రంగమేనని అన్నారు. గ్రీన్‌ఇండస్ట్రియల్ పార్కులోని మహిళ పారిశ్రామికవేత్తలు నిర్మలాజగ్గారెడ్డికి మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి కె.భాస్కర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు వ్యాసరచన పోటీలు

భువనగిరిటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వ్యాసరచన పోటీ నిర్వహించనున్నట్లు ఐలు జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మహిళా న్యాయవాదులు, మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు -పరిష్కార మార్గాలు' అనే అంశంపై పోటీలు ఉంటాయన్నారు. ఉత్తమ వ్యాసరచనలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఐలు సభ్యులు బొల్లపెల్లి కుమార్, చింతల రాజశేఖర్‌రెడ్డి, బొడ్డుకిషన్, ఎండీ నిహాల్‌కు 10వ తేదీ సాయంత్రం 5గంటల లోపు వ్యాసాలను పంపాలని సూచించారు.

ఎయిమ్స్ అభివృద్ధికి కృషిచేస్తా

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్: బీబీనగర్ ఎయిమ్స్ అభివృద్ధికి కావాల్సిన నిధుల గురించి రానున్న పార్లమెంట్‌లో సమావేశాల్లో చర్చిస్తానని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీబీనగర్ ఎయిమ్స్‌ను సందర్శించిన ఆయన అక్కడ కొనసాగుతున్న అభివృద్ధి పనుల గురించి ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియాను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణ పనులు నిలిచిపోకుండా అదనంగా అవసరమయ్యే నిధుల గురించి చర్చించారు. అదేవిధంగా రోగులను నేరుగా కలిసి వారికి అందుతున్న వైద్య సేవలు, ఎదురవుతున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం ఎయిమ్స్‌లో అత్యాధునిక వైద్య పరికరాలు కావాల్సి ఉన్నాయని, వాటి కొనుగోలు కావాల్సిన నిధుల గురించి పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావిస్తానని తెలిపారు.



ఎయిమ్స్‌లో రోగులతో మాట్లాడుతున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి